జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 69 21-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




## మమతా మ్యానిఫెస్టో విడుదల..

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ తన మ్యానిఫెస్టో విడుదల చేసింది. దీదీకే వచన్ పేరుతో ప్రజలకు పది హామీలను ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ ప్రకటించింది.



మిగతా 2లో

## పేలుళ్లతో దద్దరిల్లిన దుబాయ్, బహ్రెయిన్

- శత్రువులకు ఇరాన్ హెచ్చరిక
- గల్ఫ్‌లోని చమురు క్షేత్రాలపై మరిన్ని దాడులు
- కువైట్‌లోని రెండు రిఫైనరీల్లో భారీగా మంటలు
- గల్ఫ్‌కు మరో మూడు అమెరికా యుద్ధ నౌకలు

# నిధుల మూట.. ప్రగతి బాట



- లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం.. తెలంగాణ బ్రాండ్‌పై నమ్మకం కల్పించాం
- 202627 బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తాం
- ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమే సర్కారు లక్ష్యం
- గత రెండున్నరేళ్లుగా ఇదే బాటలో సాగుతున్నాం..
- గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ పాలన గాడిలో పెడుతున్నాం
- ఇవి కేవలం అంకెలు కాదని, ప్రజల జీవనగతిని మార్చే లెక్కలన్న ఉప ముఖ్యమంత్రి

హైదరాబాద్: 'ధీరోదాత్తుడు ఎన్నడూ అవరోధాలకు బెదరడు. అవరోధాలనే అవకాశాలుగా మలచుకుని ముందుకు సాగుతాడు. ఇప్పుడు రాష్ట్రంలో మా ప్రభుత్వం అదే చేస్తోంది. ప్రగతిలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలపాలనే లక్ష్యం పెట్టుకున్నాం. అందుకే రూ.లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి అంతర్జాతీయంగా తెలంగాణ బ్రాండ్‌పై నమ్మకం కలిగించాం. ఇక పురోగతిలో మా మార్కు చూపుతాం. గత రెండున్నరేళ్లుగా ఈ బాటలోనే సాగుతున్నాం. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక, వ్యవస్థల విధ్వంసాన్ని సరిచేస్తూ, పాత అప్పులను, వాటికి వడ్డీలను కట్టుకుంటూనే పాలనను గాడిలో పెడుతున్నాం. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం..' అని రాష్ట్ర ఆర్థిక శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. 'ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే మా లక్ష్యం. మేము పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం. ప్రజలు మాకు అప్పగించిన ఈ అధికారాన్ని ఒక బాధ్యతగా భావించి, ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకుపోతున్నాం.



## సోషల్ మీడియా ప్రచారాలు భయాందోళనలు కలిగిస్తున్నాయి

రాష్ట్రంలో గృహ అవసరాలకు సరిపడా వంట గ్యాస్ నిల్వలు ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని, అయితే సోషల్ మీడియాలో ప్రచారాలు భయాందోళన కల్గిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గ్యాస్

2లో

## ఏపీలో నిరుద్యోగులకు కూటమి సర్కార్ మోసం : వైఎస్ షర్మిల



అమరావతి : కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ అంటూ రెండేళ్లుగా ఊరించి ఉసూరుమనిపించిందని ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల (వైఎస్ ష్మతీఎఅశ్రీఖ) ఆరోపించారు. కొండంత రాగం తీసి కూసంత పాట పాడినట్లుందని, నిరుద్యోగ బిడ్డలను నమ్మించి నయవంచన చేసిందని ట్విటర్ వేదికలో విమర్శించారు.



## ఇది ప్రజలను నిరాశపరిచే బడ్జెట్

- వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ల పెంపు ఊసే లేదు
- మహిళలకు ఇస్తామన్న రూ.2,500, నిరుద్యోగ భృతి
- రూ.4 వేల ప్రస్తావనే లేదు
- క్యూర్, ప్యూర్, రేర్ కాదు.. చోర్, గోల్ మాల్ మోడల్ అన్న బీఆర్ఎస్ నేత

2లో



## వచ్చే రెండు రోజులు వర్షాలు

అమరావతి: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న రెండు రోజులు రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ,




## దక్షిణ కొరియాలో ఘోర అగ్నిప్రమాదం

- వాహనాల విడిభాగాల ఫ్యాక్టరీలో మంటలు
- 53 మందికి గాయాలు.. 24 మంది పరిస్థితి విషమం
- మరో 14 మంది గల్లంతు

2లో

# పంట నష్టంపై రెండు రోజుల్లో నివేదిక

- ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు
- అకాల వర్షాలు, గ్యాస్ సరఫరాపై సీఎం సమీక్ష
- కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- 20లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం
- ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీ
- మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్లు



అమరావతి :అకాల వర్షాలు, భారీ గాలులు, వడగళ్లతో రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై రెండు రోజుల్లో పూర్తిస్థాయి అంచనాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గల్ఫ్ యుద్ధం నేపథ్యంలో ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ల సరఫరాకు అంతరాయం రాకుండా చూడాలని చెప్పారు. శుక్రవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అకాల వర్షాలతో 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటకు నష్టం వాటిల్లిందని అధికారులు వివరించారు. వీటి విలువ రూ.40 కోట్లుగా అంచనా వేశారు. అలాగే 9 జిల్లాల్లోని 48 మండలాల్లో

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..


# మమతా మ్యానిఫెస్టో విడుదల..

(మొదటి పేజీ తరువాయి)

దీదీకే వచన్ దువారో చికిత్స ( ప్రజలకు ఇంటి వద్దకే వైద్యసేవలు) నిరుద్యోగులకు ప్రతినెల రూ.1,500, మహిళలకు ప్రతినెల రూ. 1,500,ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ. 1,700 అందజేయనున్నట్లు ప్రకటించింది. వీటితో పాటు మరిన్ని సంక్షేమ ఫలితాలను ప్రకటించింది. బెంగాల్‌లో 294 స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీలలో ఎన్నికలు జరగనున్నాయి. కాగా ఇటీవలే ఐదు రాష్ట్రాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. పశ్చిమబెంగాల్‌తో పాటు తమిళనాడు,కేరళ, అస్సాం, పుదుచ్చేరి ప్రాంతాలకు ఎన్నికలు జరగనున్నాయి.మెత్తంగా ఐదు రాష్ట్రాల్లో కలిపి 824 అసెంబ్లీ స్థానాలకు పోటీ జరుగుతుండగా 17.4 కోట్ల మంది ఓటర్లు పాల్గొననున్నారు. ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో ఎలక్షన్ కమిషన్ కీలక చర్యలు చేపట్టింది. సీఎం మమతా బెనర్జీ పేచీలో ఉన్న చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీని తొలగించి వారి స్థానంలో ఇతర అధికారులను నియమించింది. అయితే పశ్చిమ బెంగాల్ రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ సారి 226 కు పైగా స్థానాల్లో విజయం సాధించి వరుసగా నాలుగవ సారి అధికారం ఏర్పాటు చేస్తామని మమతా బెనర్జీ ప్రకటించింది. ఈ ఏడాది భవానీపూర్ స్థానం నుంచి పోటీ చేస్తానని తెలిపింది. దీంతో బీజేపీ సైతం మమత పోటీ చేస్తున్న స్థానంలో తమ అభ్యర్థిగా సువేందు అధికారిని నిలపనుంది. 2021లో జరిగిన ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి పోటీ చేసిన మమత సువేందు అధికారి చేతిలో ఓడిపోయింది. దీంతో భవానీపూర్ నుంచి గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెట్టింది. 2021లో టీఎంసీ 213 స్థానాలు గెలుచుకొని హ్యాట్రిక్ విజయం సాధించింది. 2016లో మూడు సీట్లకు పరిమితమైన బీజేపీ 2021లో 77 స్థానాలు చేజిక్కించుకొని ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. దీంతో ఈ ఏడాది పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు రసవత్తరంగా మారాయి.

# దక్షిణ కొరియాలో ఘోర అగ్నిప్రమాదం

సియోల్: దక్షిణ కొరియాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. వాహనాల విడిభాగాల ఫ్యాక్టరీలో మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో కనీసం 53 మంది గాయపడ్డారు. వారిలో 24 మంది పరిస్థితి విషయంగా మారింది. డెడ్‌యోక్ జిల్లాలోని డెజియోన్ నగరంలో శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మరో 14 మంది జాడ గల్లంతయ్యింది. వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. మధ్యాహ్నం 1.17 గంటలకు ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ప్రమాదానికి కారణం ఏమిటన్నది ఇంకా గుర్తించలేదు. మంటల తీవ్రతకు ఫ్యాక్టరీ నేలమట్టమైంది. కొందరు ఫ్యాక్టరీ పై నుంచి దూకడంతో గాయాలపాలయ్యారు. లోపలున్న వారు పొగ పీల్చి అస్వస్థతకు గురయ్యారు. ఫ్యాక్టరీలో రసాయనాల నిల్వలుండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి.

# వచ్చే రెండు రోజులు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల శనివారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆదివారం కొన్నిచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

# సోషల్ మీడియా ప్రచారాలు భయాందోళనలు కలిగిస్తున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

కొరతపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అపోహలను నమ్మవద్దని, భయాందోళనలకు గురి కావొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిన్న కానూరులోని సివిల్ సప్లైస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాలో కొందరు సృష్టిస్తున్న వదంతుల వల్లే ప్రజలు ఆందోళనకు గురై అధికంగా సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు. దీనివల్లే కృత్రిమ కొరత ఏర్పడుతోందన్నారు. గత వారం రోజుల్లోనే ఇలాంటి బుకింగ్స్ పెరిగాయని, సెప్టెంబర్ 14న 5.04 లక్షలుగా ఉన్న బుకింగ్స్ ఇప్పుడు 2.96 లక్షలకు తగ్గాయని వివరించారు. రాష్ట్రంలో ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలు నిరంతరాయంగా గ్యాస్ సరఫరా చేస్తున్నాయని చెప్పారు. వాణిజ్య అవసరాలకు సంబంధించి ఆసుపత్రులు, పాఠశాలలు, వసతి గృహాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని, క్రమంగా సరఫరా మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. బ్లాక్ మార్కెట్‌పై ఉక్కుపాదం మోపుతామని, నిబంధనలు ఉల్లంఘించిన 6 నుంచి 9 ఏజెన్సీలపై ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. మోసాలకు తావులేకుండా 100 శాతం ఓటీపీ ఆధారిత డెలివరీ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వాడకాన్ని ప్రోత్సహించేందుకు సోమవారంలోగా కొత్త పాలసీ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే రాష్ట్రంలో కిరోసిన్ సరఫరాను పునఃప్రారంభిస్తామని మంత్రి ప్రకటించారు.


# ఏపీలో నిరుద్యోగులకు కూటమి సర్కార్ మోసం

(మొదటి పేజీ తరువాయి)

జాబ్ క్యాలెండర్ పేరుతో చంద్రబాబు చేసింది పచ్చి మోసమని, ముష్టి 10 వేల పోస్టులకు షెడ్యూల్ ఇచ్చి, మాట నిలబెట్టుకున్నామని, జాబ్ ఫస్ట్ విధానమని గొప్పలు చెప్పడం సిగ్గుచేటని పేర్కొన్నారు. విద్యాశాఖలో బోధన, బోధనేతర ఖాళీలు 30 వేల ఉద్యోగాలు, పోలీస్ శాఖ 19,999 ఉద్యోగాలు, ఇంజినీరింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులు, పంచాయతీ రాజ్ శాఖలో 26 వేల నియామకాల గురించి ప్రస్తావన లేదని విమర్శించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో లెక్కకు తీసిన 27 వేల ఖాళీల భర్తీ లేనట్లేనా? రెవెన్యూలో 13 వేలు, వైద్యశాఖలో 26 వేలు, వ్యవసాయ శాఖలో 3 వేల ఖాళీలను వెంటనే నింపుతామని ఇచ్చిన హామీలు బూడిద పాలేనా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో 153 విభాగాల పరిధిలో 1.80 లక్షలు ఖాళీలున్నాయని తెలిపారు. దేశంలోనే రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందని తెలిపారు.

# పంట నష్టంపై రెండు రోజుల్లో నివేదిక

1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలపైనా ప్రభావం చూపాయని తెలిపారు. అరటి, బొప్పాయి, మిర్చి, మామిడి, నిమ్మ, బత్తాయి, కూరగాయల పంటలు దెబ్బతినగా, రూ.23కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. మొత్తం నష్టం రూ.63కోట్లుగా అంచనా వేశారు. దీనిపై రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. యుద్ధం కొనసాగితే.. ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం ఉందని, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వకుండా చూడాలని ఆదేశించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలు, విద్యా సంస్థలు, ఆలయాలు, అన్నక్యాంటీన్లు, అంగన్వాడీలకు గ్యాస్ సరఫరాలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టా ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తామని అన్నారు.ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీచేసేందుకు ఈసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు భర్తీచేస్తామని వివరించారు. ఉగాది పచ్చడి జీవితాలను ప్రతిబింబిస్తుందని, షడ్రుచుల తరహాలో జీవితంలోనూ కష్టసుఖాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి తెలుగుజాతిని



అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకుని ముందడుగు వేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. యువతకు ఉద్యోగ కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇప్పటివరకు 30,607 మందికి ప్రభుత్వోద్యోగాలు ఇచ్చాం. ప్రైవేటురంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం' అని సీఎం వివరించారు.జాబ్ ఫస్ట్ అనేది కూటమి ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి ఉగాది కానుకగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను జత చేశారు. 'శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివిధ ప్రభుత్వశాఖల్లో 10,060 ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం. మే 15 నుంచి అక్టోబరు 15 వరకు వీటి నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. ఉద్యోగార్థులు సన్నద్ధత, ప్రతిభతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను' అని అందులో పేర్కొన్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పంచాగశ్రవణం చేశారు. సంగీత, సాహిత్య, కళారంగాల్లో విశేషకృషి చేసిన 38 మందికి కళారత్న, 112 మందికి ఉగాది పురస్కారాలు సీఎం అందించారు. వ్యవసాయ, ఉద్యాన, తితిదే పంచాంగాలు, సాంస్కృతికశాఖ, శిల్పారామం వార్షిక కార్యక్రమాల క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 'మన పండగలు, ఆచారాల్లోనే సైన్స్ ఉంది. వాస్తు, సూర్య నమస్కారాలు ఇలాంటివే. యోగా, నేచురోపతి కూడా ప్రకృతి నుంచి వచ్చినవే. విలువలతో జీవనం గడిపేవారికి ఉన్న ఆనందం మరెవరికీ ఉండదు. మనకంటే విదేశాల్లోని ప్రవాసాంధ్రులు మన సంస్కృతీ సంప్రదాయాలు పాటించి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ ఆర్థిక, సామాజిక, ఆరోగ్యభద్రత అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. దివ్యాంగ శక్తి, స్త్రీశక్తి పథకాలతో దివ్యాంగులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది.

# ఇది ప్రజలను నిరాశపరిచే బడ్జెట్

హైదరాబాద్: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘోరీ కట్టారని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత హరీశ్‌రావు విమర్శించారు. ఇది దగాకోరు, ప్రజలను తీవ్రంగా నిరాశపరిచే బడ్జెట్ అని అన్నారు. వృద్ధాప్య, దివ్యాంగుల పింఛను పెంపు ఊసే లేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ప్రస్తావన కానీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4 వేల గురించిన కనీస ఊసు కానీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల్లో కొన్ని అమలు చేస్తూ అందులోనూ గత బడ్జెట్‌తో పోలిస్తే కోతలు పెట్టారన్నారు. ఆరు గ్యారంటీల విషయంలో గతేడాది రూ.56 వేల కోట్లు పెడితే, ఈ బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లకు కుదించారని పేర్కొన్నారు. కొత్త పింఛన్లు కాదు ఉన్న పింఛన్లు ఊడగొడుతున్నారని ధ్వజమెత్తారు. 3 లక్షల పింఛన్లు తొలగించి, 2 లక్షల కొత్త పింఛన్లు ఇస్తామంటున్నారని విమర్శించారు. 18 ఏళ్లు పైబడిన విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. శుక్రవారం ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, కేపీ వివేకానంద, సంజయ్, పల్లా రాజేశ్వరరెడ్డి, చింతా ప్రభాకర్‌లతో కలిసి హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడారు. 'బడ్జెట్ ప్రసంగాన్ని 20 పేజీలు, బడ్జెట్‌ను రూ.20 వేల కోట్లు పెంచారే తప్ప.. ఆరు గ్యారెంటీల ఊసెత్తలేదు. నిధుల కేటాయింపు చేయలేదు. కాగితాల మీద అంకెలు ఉన్నాయి తప్ప.. ప్రజల కష్టాలు తీర్చడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. గత బడ్జెట్‌లో చెప్పిన పథకాలు అమలు చేయలేదు. మళ్లీ అవే పథకాలు వల్లవేశారు. గత బడ్జెట్‌లోనే రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.6 వేల కోట్లు కేటాయించారు కానీ పైసా విడుదల చేయలేదు. మళ్లీ ఈసారి బడ్జెట్‌లో అంతే మొత్తాన్ని ప్రతిపాదించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలోనూ అదే జరిగింది. ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీల పేర్లు చెప్పివారి ఆత్మ క్షోభించేలా చేస్తున్నారు..'అని హరీశ్‌రావు విమర్శించారు. 'తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ పేరిట, హైదరాబాద్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా మూడు ముక్కలు చేయడం తప్ప చేసిందేమీ లేదు. క్యూర్, ప్యూర్, రేర్ కాదు.. చోర్ మోడల్, గోల్‌మాల్ మోడల్. బడ్జెట్ అంతా బోగస్. అభయహస్తం కాదు రిక్త హస్తమని ప్రజలకు అర్థమైంది. పింఛన్ల పెంపు ఎప్పుడా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పదవీ విరమణ ఉద్యోగులకు ప్రయోజనాలు లేవు. అన్ని కులాలకు, వర్గాలకు మొండిచేయి చూపారు. మూడేళ్లు నిండకముందే రూ.మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారు. అంత అప్పు చేసి ఒక్క రూపాయితో ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించారా? కేసీఆర్ కాళేశ్వరం కట్టారు. మిషన్ భగీరథ అమలు చేశారు. మెడికల్ కాలేజీలు కట్టించారు. కేసీఆర్ తాను తెచ్చిన అప్పులను మూలధన పెట్టుబడిగా మార్చి సంపద సృష్టించారు.

# నిధుల మూట.. ప్రగతి బాట

(మొదటి పేజీ తరువాయి)

రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, విద్యార్థులకు పౌష్టికాహారం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, రాష్ట్రాన్ని సుస్థిరమైన అభివృద్ధి వైపు నడిపించేదిగా 202627 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను రూపొందించాం..' అని పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో 202627 ఆర్థిక సంవత్సరానికి రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా చూపించారు. ఈ సందర్భంగా ఆయన దాదాపు రెండు గంటల పాటు ప్రసంగించారు. ముఖ్యాంశాలు ఉప ముఖ్యమంత్రి మాటల్లోనే.. వరసగా నాలుగోసారి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం కల్పించిన ప్రజలకు ధన్యవాదాలు. మేం ప్రజలిక్చిన హామీలను, ప్రజలు మాపై పెట్టుకున్న ఆశలను ఈ రెండున్నరేళ్ల పాలనలో సంతృప్తికరమైన స్థాయిలో నెరవేరుస్తూ వస్తున్నాం. పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును, తిరిగి ప్రజల అభ్యున్నతి కోసమే వెచ్చిస్తున్నాం. ప్రతి పైసకు మేం కాపలాదారుగా ఉంటున్నాం. రాజ్యాంగ విలువలకు కట్టుబడి, పారదర్శకతతో పాలన సాగిస్తున్నాం. రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా నిలబెడుతున్నాం. సుస్థిర రాజకీయ వ్యవస్థ, పటిష్ట ప్రణాళిక, దూరదృష్టి, ప్రజలకు మేలు చేయాలనే పట్టుదల మమ్మల్ని నడిపిస్తున్నాయి. బడ్జెట్ అంటే సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదు, ప్రజల చుట్టూ తిరిగే సంఖ్యలు. ప్రజల జీవన స్థితిగతుల మార్పునకు దోహదపడే లెక్కలు. ప్రజల ఆశలు, ఆశయాలను నిజం చేసే సంకల్ప పత్రమే ఈ బడ్జెట్. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అద్దం పట్టేలా దీన్ని రూపొందించాం.

# పేలుళ్లతో దద్దరిల్లిన దుబాయ్, బహ్రెయిన్

దుబాయ్: పశ్చిమాసియా యుద్ధం చినికి చినికి గాలివానగా మారుతోంది. ఇజ్రాయెల్అమెరికా రాజేసిన యుద్ధ జ్వాలలను ప్రపంచమంతటికీ విస్తరించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోంది. శుక్రవారం ఆ దిశగా స్పష్టమైన సంకేతాలిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలు, ప్రఖ్యాత విడిది కేంద్రాలన్నింటినీ ఇకపై దాడులకు లక్ష్యంగా చేసుకుంటామంటూ తీవ్ర హెచ్చరికలు జారీచేసింది. "పార్కులు, విడిది, పర్యాటక కేంద్రాల వంటివేవీ మా శత్రువులకు ఇకపై సురక్షితం కాదు. ప్రపంచవ్యాప్తంగా వాటన్నింటినీ లక్ష్యాలుగా చేసుకుంటాం" అని ఇరాన్ సైనిక ఉన్నతాధికారి అబుల్ ఫజల్ షెకార్చీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో దుబాయ్ తదితర గల్ఫ్ ప్రాంతాల్లోని ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక కేంద్రాలపై దాడులు తప్పవన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు రంజాన్ పర్వదినం సందర్భంగా కూడా ఇరాన్ నెమ్మదించలేదు. గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలపై దాడుల తీవ్రతను మరింతగా పెంచింది. కువైట్‌లో రెండు రిఫైనరీలపై డ్రోన్ దాడులకు దిగింది. దాంతో రోజుకు ఏకంగా 7.3 లక్షల బ్యారెళ్ల చమురు శుద్ధి చేసే మినా అల్ అహ్మదీ రిఫైనరీలో పలు యూనిట్లు మంటల్లో చిక్కాయి. వాటిని ఆర్పేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. కువైట్‌లోని మైనా అబ్దుల్లా చమురు క్షేత్రం కూడా దాడులకు గురైంది. ఈ రెండు క్షేత్రాలపై గురువారం కూడా ఇరాన్ దాడులు చేయడం తెలిసిందే.



సౌదీ అరేబియా, బహ్రెయిన్, దుబాయ్‌ల్లో కూడా భారీ బాంబుల మోతలతో దద్దరిల్లిపోయాయి. ఈ నేపథ్యంలో తన గడ్డపై ఉన్న ఇరాన్ సంస్థలన్నింటినీ మూసేయాలని దుబాయ్ నిర్ణయించుకుంది. ఇజ్రాయెల్‌లో హైఫాలో ఉన్న అతి పెద్ద చమురు శుద్ధి కేంద్రంపై కూడా ఇరాన్ భారీగా దాడులు చేసింది. దాంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. జెరూసలేం, టెల్ అవీవ్‌తో పాటు దేశవ్యాప్తంగా దాడులు కొనసాగాయి.బాలిస్టిక్ క్షిపణి తయారీ సామర్థ్యాన్ని కోల్పోయానన్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఇప్పటికీ భారీ సంఖ్యలో క్షిపణులను తయారు చేస్తున్నట్టు స్పష్టం చేసింది. గురువారం తన గగనతలంలో అమెరికాకు చెందిన ఎఫ్35 యుద్ధ విమానంపై చేసిన దాడికి సంబంధించి వీడియో క్లిప్పింగ్‌ను కూడా విడుదల చేసింది. ఈ అత్యాధునిక స్టెల్త్ ఫైటర్ జెట్లు దాడికి గురికావడం వాటి చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం! పర్షియా నూతన సంవత్సరం 'నౌరోజ్' నాడు ఇరాన్‌పై ఇజ్రాయెల్ ముమ్మర దాడులు కొనసాగాయి. రాజధాని టెహ్రాన్‌తో పాటు పలు దేశవ్యాప్తంగా నగరాలు పేలుళ్లతో దద్దరిల్లిపోయాయి. టెహ్రాన్‌లోని బసీజ్ గ్రూప్ ప్రధాన కార్యాలయంపైనా బాంబుల వర్షం కురిపించింది.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## యాదగిరీశుని అన్నదానానికి రూ. 6 లక్షల విరాళం

**యాదగిరిగుట్ట, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి సన్నిధిలో భక్తుల ఆకలి తీర్చేందుకు దాతలు తమ ఉదారతను చాటుకుంటున్నారు. శుక్రవారం పాలమూరు సీడ్స్‌కు చెందిన సుదర్శన్ రెడ్డి, ఆయన భార్య స్వామివారిని దర్శించుకుని, ఆలయ నిత్య అన్నదాన పథకానికి రూ. 6 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం దాతలు కార్యాలయంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) భవాని శంకర్‌ను కలిసి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షేత్రానికి వచ్చే భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందించే ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావడం తమ పూర్వజన్మ సుకృతమని, స్వామివారి సేవలో ఈ విరాళం అందించడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈఓ భవాని శంకర్ దాతలకు స్వామివారి ప్రసాదాలను అందజేసి, వారి సేవా గుణాన్ని అభినందించారు.

## రాజాపేట గాయకుడికి ఉత్తమ గాయక పురస్కారం

- విక్టరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాస్కర్‌కు ఘన సత్కారం



**రాజపేట, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** మండల కేంద్రానికి చెందిన యువ కళాకారుడు కొత్తకొండ భాస్కర్‌కు అరుదైన గౌరవం లభించింది. ఒక సామాన్య పేద కుటుంబంలో జన్మించిన భాస్కర్, పట్టుదలతో సంగీత రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ఆయన ప్రతిభను గుర్తిస్తూ గుంతకల్ విక్టరీ ఫౌండేషన్ వారు తాజాగా 'ఉత్తమ గాయకుడు' అవార్డును ప్రకటించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ విజయకుమారి బృందం భాస్కర్‌ను ఘనంగా సన్మానించింది. ఆయనకు ప్రశంసా పత్రం, శాలువా, పూలమాలతో పాటు జ్ఞాపికను అందజేసి గౌరవించారు. చిన్నతనం నుంచే పాటల పట్ల మక్కువ పెంచుకున్న భాస్కర్, ఎటువంటి శాస్త్రీయ శిక్షణ లేకపోయినా స్వయంకృషితో తన గాత్రాన్ని మెరుగుపరచుకున్నారు. అనేక వేదికలపై తన గళంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తూ ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్నారు. రాజాపేట మట్టిలో పుట్టిన ఈ కళాకారుడు జాతీయ స్థాయి గుర్తింపు సాధించడం పట్ల స్థానిక ప్రజలు గర్వపడుతున్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు.

## పొట్టిమరి వాగు ఉధృతి.. నిలిచిన రాకపోకలు

- మల్లన్నసాగర్ జలాలతో పొంగిపొర్లుతున్న వాగు
- వంతెన పనుల వద్ద పైపులపై నుంచి ప్రవాహం.. దారిమళ్లింపు

**రాజపేట, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** రాజపేట – యాదగిరిగుట్ట ప్రధాన రహదారిపై ప్రయాణికులకు చుక్కెదురైంది. మండల పరిధిలోని పొట్టిమరి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో శుక్రవారం రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి తుంగతుర్తి నియోజకవర్గానికి సాగునీటిని విడుదల చేయడంతో వాగులోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం పొట్టిమరి వాగు వద్ద హైలెవల్ వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రాకపోకల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పైపుల పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాల రాకను నిలిపివేశారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. వాగుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను దారిమళ్లిస్తున్నారు. యాదగిరిగుట్ట నుంచి రాజపేట వైపు వచ్చే వాహనదారులు రఘునాథపురం మీదుగా, లేదా బేగంపేట మీదుగా వెళ్లాలని సూచించారు. వంతెన పనులు సాగుతున్న సమయంలో నీటి విడుదల వల్ల ఈ సమస్య తలెత్తిందని, ప్రయాణికులు సహకరించాలని కోరారు. అకస్మాత్తుగా నీరు రావడంతో ద్విచక్ర వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



# ఇక్కత్‌కు అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలి







- నాణ్యత, ఆధునిక డిజైన్లతోనే గుర్తింపు
- ఎల్లంబావి మహిళా సంఘం సభ్యులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**చౌటుప్పల్, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** ఇక్కత్ చేనేత చీరలు, ఫ్యాబ్రిక్ ఉత్పత్తులను మార్కెట్లో ప్రత్యేకమైన బ్రాండ్‌గా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. శుక్రవారం చౌటుప్పల్ మండలంలోని ఎల్లంబావి గ్రామంలో రూర్బన్ ప్రాజెక్ట్ కింద ఏర్పాటు చేసిన మహిళా ఇక్కత్ హస్తకళా పరస్పర సహకార సంఘాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులతో కలెక్టర్ సమావేశమై, వారి సమస్యలు, ఉత్పత్తి విధానం, మార్కెటింగ్ పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న షెడ్ సరిపోవడం లేదని, అదనంగా మరో షెడ్ ఏర్పాటు చేయాలని, బోర్ మోటార్ సౌకర్యం కల్పించాలని, అలాగే ఉత్పత్తుల విక్రయానికి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, చేనేత ఉత్పత్తులకు నాణ్యతను పెంచుతూ ఆధునిక డిజైన్లు, సమర్థవంతమైన మార్కెటింగ్ పద్ధతులు అవలంబిస్తే మన జిల్లా ఇక్కత్ చీరలు, ఫ్యాబ్రిక్ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావచ్చన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆన్‌లైన్ మార్కెట్లలో కూడా విక్రయ అవకాశాలను అన్వేషించాలని సూచించారు. ఇక్కత్ చీరల ప్రత్యేకతను కాపాడుతూ వాటిని ఒక బ్రాండ్‌గా నిలిపేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పోచంపల్లి, కొయ్యలగూడెం ప్రాంతాల ఇక్కత్ చీరలు సంప్రదాయ నైపుణ్యం, ప్రత్యేక డిజైన్లు, నాణ్యతతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, ఈ ప్రత్యేకతను మరింత బలోపేతం చేసి స్థిరమైన బ్రాండ్ ఇమేజ్ సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రింటింగ్ చీరలు, చేనేత చీరల మధ్య తేడాలను ప్రజలకు తెలియజేయాలని, డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన పెంచాలని సూచించారు. మహిళా ఇక్కత్ సంఘానికి అదనపు షెడ్, బోర్ మోటార్ కోసం ఎస్టిమేట్లు సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే హైదరాబాద్‌లోని శిల్పారామంలో సంఘానికి ఒక షాప్ కేటాయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సొసైటీకి ప్రత్యేక లోగో, లేబుల్ రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, కొయ్యలగూడెం సర్పంచ్ కైరం కొండ స్వప్న, ఎల్లంబావి సర్పంచ్ గంజి వనజ, మహిళా ఇక్కత్ సహకార సంఘం అధ్యక్షురాలు లత, అదనపు డీఆర్‌డీఓ సురేష్, చేనేత శాఖ అభివృద్ధి అధికారి బలరాం రెడ్డి, ఎంపీడీఓ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య స్కూల్‌లో అలరించిన 'చిట్టి' ఉపాధ్యాయులు



- ఘనంగా స్వపరిపాలన దినోత్సవం..
- ఏడో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

**భూదాన్ పోచంపల్లి, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని దిగులపల్లిలో గల చైతన్య గ్రామర్ స్కూల్‌లో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం కన్నుల పండువగా జరిగింది. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠశాల నిర్వహణ బాధ్యతలను భుజానికెత్తుకున్నారు. ఈ సందర్భంగా ఏడో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ చారి ప్రసంగించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవాటు చేసుకుంటేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆయన హితబోధ చేశారు. వివిధ ప్రజాప్రతినిధుల వేషధారణలో విద్యార్థులు పాఠశాలకు విచ్చేసి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, రుక్మిణి, కళ్యాణి, పద్మ, సుజాత, సరిత, వనిత, మనీషా, లావణ్య, లలిత, సంతోష తదితరులు పాల్గొన్నారు.



## నర్సాపురంలో అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన

- పాల్గొన్న సర్పంచ్ శిరీష నాగరాజు, మాజీ జడ్పీటీసీ రాజిరెడ్డి
- చిన్నారుల అభివృద్ధికి పెద్దపీట

**రాజపేట, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది పడింది. శుక్రవారం గ్రామంలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి సర్పంచ్ ఎమ్మ శిరీష నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన ముందస్తు విద్యను అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులతో పాటు ప్రభుత్వ సహకారంతో ఈ భవనాన్ని సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగిర్తి రాజిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వ భవనాల నిర్మాణంతో గ్రామాల రూపురేఖలు మారుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దండే లక్ష్మణ్, ఉప సర్పంచ్ నారాపాక కరుణాకర్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## రాజాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ తనిఖీ

- రికార్డుల పరిశీలన.. సిబ్బందికి పలు సూచనలు

**రాజపేట, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ మనోహర్, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుమన్ కళ్యాణ్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను కలియతిరిగిన అధికారులు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బంది హాజరు శాతాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్ ద్వారా నిత్యం వచ్చే ఓపీ (బయటి రోగులు), గర్భిణీలకు అందుతున్న సేవలు, ప్రసవాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న వసతులు, ఖాళీల వివరాలను నమోదు చేసుకున్నారు. వేసవి నేపథ్యంలో రాబోయే సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## రాజాపేటలో భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు.. పండిత సత్కారం

**రాజపేట, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రాజపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కోయ మధు నేతృత్వంలో పండిత సత్కార కార్యక్రమం చేపట్టారు. శ్రీ రామకృష్ణ సాయి మందిర అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మను గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నమిల కేదారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్ గౌడ్, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింలు, ఆడెపు శ్రీశైలం, రేగు సిద్ధులు, దాచేపల్లి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, కాయితి బాల్ రెడ్డి, బిర్రు సురేష్, దేవి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.





# బసంతపురంలో ఉచిత వైద్య శిబిరం

- పరీక్షలు నిర్వహించి, మందుల పంపిణీ

**రాజపేట, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండల పరిధిలోని బసంతపురం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎంబీఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో, మేడ్చల్ మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్య బృందం రోగులకు వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు, విటమిన్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే తమ ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి సేవా కార్యక్రమాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గంధమల బాలకృష్ణ, ఉపేందర్ రెడ్డి, సాయి రెడ్డి, మహేష్ బాబు, శివ, సాయి, శ్రీనివాస్, వినయ్, మహేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజపేటలో ఘనంగా ఇఫ్తార్ విందు



- మత సామరస్యానికి ప్రతీక రంజాన్: నమిల మహేందర్ గౌడ్

**రాజపేట, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండల కేంద్రంలో మత సామరస్యం వెల్లివిరిసింది. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ శుక్రవారం రాత్రి తన స్వగృహంలో ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని, అందరూ కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ విందులో మైనార్టీ సెల్ అధ్యక్షులు తయ్యాబలితో పాటు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్, డాక్టర్ చింతల రవి దంపతులు, పుంటికూర మహేష్, రేగు సిద్ధులు, గోలనకొండ భిక్షపతి, ఆంజనేయులు, పొట్టబత్తిని వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. విందు అనంతరం మహేందర్ గౌడ్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎల్లయ్య మృతికి సుధీర్ బాబు సంతాపం

- కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం



**రామన్నపేట, మార్చి 20, (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని జనంపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది గట్టు ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆయన భౌతికకాయానికి మాజీ ఎంపీటీసీ వేమవరం సుధీర్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, తక్షణ సాయంగా రూ.5,000 నగదును అందజేశారు. కష్టకాలంలో పేద కుటుంబాలకు అండగా ఉండటం అందరి బాధ్యతని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ సర్పంచ్ రేఖ యాదయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండ ఉపేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నక్క నరేందర్, ఉపసర్పంచ్ చొప్పరి నరసింహ పాల్గొన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఎల్లయ్య మృతి పట్ల గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నక్క రాములు, నల్ల సైదులు, నాయకులు చొప్పరి లింగయ్య, బీరం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ కార్యవర్గ సభ్యుడిగా ఎం.డి. ఖుర్షిద్



**వలిగొండ, మార్చి 20, (తొలివెలుగు న్యూస్):** వలిగొండ మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎం.డి. ఖుర్షిద్‌కు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు దక్కాయి. గురువారం నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ పాలకవర్గ సమావేశంలో ఆయనను డీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గతంలో వలిగొండ 3వ వార్డు సభ్యుడిగా, జిల్లా మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఖుర్షిద్ సేవలను గుర్తించి ఈ పదవిని అప్పగించారు. ఈ సందర్భంగా ఖుర్షిద్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి, జిల్లా కాంగ్రెస్ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని, అధిష్టానం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

# బాపూజీ కథకు పట్టాభిషేకం.. 'యూనిటీ'కి గద్దర్ పురస్కారం

- ఉత్తమ డాక్యుమెంటరీగా 'యూనిటీ' ఎంపిక
- డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకున్న విజయ్ బృందం



**భూదాన్ పోచంపల్లి, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** పోచంపల్లి గడ్డపై రూపుదిద్దుకున్న 'యూనిటీ' (ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్) డాక్యుమెంటరీ చిత్రం రాష్ట్రస్థాయిలో ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డును కైవసం చేసుకుంది. సామాజిక న్యాయ పోరాట యోధుడు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా యువ దర్శకుడు బడుగు విజయ్ కుమార్ రూపొందించిన ఈ చిత్రం, 2025 ఏడాదికి గాను ఉత్తమ డాక్యుమెంటరీగా ఎంపికైంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా చిత్ర బృందం ఈ పురస్కారాన్ని అందుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ.. బాపూజీ జీవిత విశేషాలను భావితరాలకు అందించాలనే తన ప్రయత్నాన్ని ప్రభుత్వం గుర్తించడం గర్వంగా ఉందన్నారు. చిత్ర నిర్మాత ధనంజయ, నటుడు మధు ఈ కార్యక్రమంలో పాల్గొని అవార్డును స్వీకరించారు.

# వీరేశంకు 'విప్'.. ఉద్యమ నేతకు దక్కిన గౌరవం!

- నాడు జైలు జీవితం.. నేడు ప్రభుత్వంలో కీలక పదవి
- ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన సంగిశెట్టి క్రిస్టఫర్

**యాదాద్రి భువనగిరి, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** నకిరేకల్ శాసనసభ్యుడు, ప్రముఖ ఉద్యమ నాయకుడు వేముల వీరేశంను ప్రభుత్వం విప్‌గా నియమించడం పట్ల తెలంగాణ ఉద్యమకారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నాయకుడికి సముచిత స్థానం దక్కిందని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో వేముల వీరేశం పోషించిన పాత్ర చిరస్మరణీయమని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో నల్లగొండ జైలులో వీరేశంతో కలిసి తాను 26 రోజుల పాటు నిర్బంధాన్ని ఎదుర్కొన్న రోజులను ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన వీరేశంకు ఈ పదవి దక్కడం వల్ల సామాన్యుల గొంతు అసెంబ్లీలో మరింత బలంగా వినిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నికార్సైన ఉద్యమకారుడిని గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆపన్న హస్తం అందించిన ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్

- అనాథ కుటుంబానికి నిత్యవసరాల పంపిణీ



**చౌటుప్పల్, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ తన సేవా గుణాన్ని చాటుకుంది. మండల పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన ఇట్టగోని కమలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మరణంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని స్థానికులు ఫౌండేషన్ చైర్మన్ ఇఎల్‌వి భాస్కర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన.. ఆ కుటుంబానికి అవసరమైన నిత్యవసర సరుకులను పంపించారు. శుక్రవారం ఫౌండేషన్ ప్రతినిధి తోకల సాయికుమార్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఈ సరుకులను అందజేశారు. ఆపదలో ఉన్న తమను ఆదుకున్న ఫౌండేషన్ చైర్మన్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఇట్టగోని చంద్రయ్య, జంగయ్య, రమేష్, లింగస్వామి, నరసింహ, విఘ్నేష్, పల్లపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారాముల కళ్యాణానికి ముమ్మర ఏర్పాట్లు

- ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్థల పరిశీలన
- మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**చౌటుప్పల్, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ పట్టణంలో ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు మున్సిపల్ యంత్రాంగం, దేవాలయ కమిటీ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్‌తో కలిసి కళ్యాణ వేదికగా నిర్ణయించిన ఆర్టీసీ బస్టాండ్ ఆవరణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సిబ్బంది వెంటనే స్థలాన్ని శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటులో రాజీ పడకూడదని సూచించారు

# అన్నదాతకు అండగా 'ప్రజా పాలన'

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- సబ్సిడీపై పనిముట్ల పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్
- గత ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజం



**భూదాన్ పోచంపల్లి, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడుగురు రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఇందులో మూడు గడ్డి కట్టే యంత్రాలు, ఐదు కల్టివేటర్లు ఉన్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులు సబ్సిడీలు, రుణమాఫీ లేక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. ప్రస్తుత ప్రజా పాలనలో రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శైలజ, కౌన్సిలర్లు శ్రీరామ మంజుల లింగస్వామి, కొండమడుగు ఎల్ల స్వామి, దేవరాయకుమార్, సర్పంచ్ మోట బాలకృష్ణ, ఉపసర్పంచ్ దాసరి నరసింహ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు పకీరు యాదిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మద్ది అంజిరెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొట్టం కరుణాకర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఫకీరు మల్లారెడ్డి, బండారు ప్రకాష్ రెడ్డి, ఏఈఓలు నరేష్, ప్రియాంక, స్వప్న, పవిత్రన్, రాజేష్, క్రాంతి పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు

**హైదరాబాద్, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** శాసనసభ విప్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డిని వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ కీలక బాధ్యతను అప్పగించినందుకు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో ప్రభుత్వం తరపున సమన్వయకర్తగా తన వంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ భేటీల్లో వేముల వీరేశంతో పాటు ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు బాలు నాయక్, మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి వీరేశంకు ప్రాధాన్యత దక్కడం పట్ల జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మంత్రులు కూడా వీరేశంకు శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**హైదరాబాద్, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నూతనంగా నియమితులైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా వీరేశం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కూడా పాల్గొన్నారు. జిల్లా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న వీరేశంకు విప్ పదవి దక్కడంపై కార్యకర్తలు పాలాభిషేకాలు, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు: షేక్ అజిత్ భాయ్



**వలిగొండ, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని టీఆర్ఎస్ మైనారిటీ నాయకులు షేక్ అజిత్ భాయ్ ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. ఈ పవిత్ర పండుగ మనుషుల మధ్య సోదరభావాన్ని, ప్రేమను పెంపొందిస్తుందని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా పండుగ జరుపుకోవాలని, అల్లాహ్ ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన కోరారు.

## పెండింగ్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం
- పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లపై కఠిన ఆదేశాలు
- వేసవి నీటి సరఫరా, మురుగు నిర్వహణపై దృష్టి



**యాదాద్రి భువనగిరి, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ, ఆరు మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, ఆస్తి పన్ను, దుకాణాల అద్దె వసూళ్లు, జనన-మరణ నమోదు, వేసవిలో నీటి సరఫరా, మురుగు కాలువల శుభ్రత, వీధి కుక్కల నియంత్రణ, పార్కుల పచ్చదనం, వీధిదీపాల నిర్వహణ, మార్కెట్ పనులు, ఎల్ఆర్ఎస్ అంశాలపై విస్తృతంగా సమీక్షించారు. పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం అసలు సహించబోమని స్పష్టం చేసిన ఆయన, ప్రతి వీధి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణ, పారవేతలో సమర్థవంతమైన విధానాలు అమలు చేయాలని తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి వందశాతం వసూలు లక్ష్యాన్ని నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## కార్మిక పక్షపాతి తిరందాసు గోపి

- సిఐటియు ఆధ్వర్యంలో 9వ వర్ధంతి వేడుకలు
- ఘనంగా నివాళులర్పించిన నాయకులు



**వలిగొండ, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** సిఐటియు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రథమ ప్రధాన కార్యదర్శి తిరందాసు గోపి కార్మిక వర్గ సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ కొనియాడారు. శుక్రవారం వలిగొండ మార్కెట్ యార్డ్‌లో గోపి 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. గోపి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షునిగా, భువనగిరి జిల్లా మొదటి కార్యదర్శిగా కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ఆయనది ప్రత్యేక శైలి అని గుర్తు చేసుకున్నారు. తొమ్మిదేళ్ల క్రితం రామన్నపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించడం కార్మిక లోకానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాధారపు మల్లేశ, కొండె నరసింహ, జన్ని జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో కార్మికులకు ఒరిగింది శూన్యం

- కార్మికులపై కపట ప్రేమ.. బడ్జెట్‌లో 'సున్నా' కేటాయింపు!
- హామీలు ఇచ్చారు.. నిధులు మరిచారు
- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి ధ్వజం



**చౌటుప్పల్, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో కార్మిక వర్గానికి మొండిచేయి ఎదురైందని బీఆర్‌టీయూ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి విమర్శించారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు కేవలం నీటి మూటలుగానే మిగిలిపోయాయని ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా కార్మికుల ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఆశలు, అంగన్‌వాడీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.18 వేల వేతనం ఇస్తామని చెప్పి ఇప్పుడు బడ్జెట్‌లో నయాపైసా కేటాయించలేదని ప్రశ్నించారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులు, వీఓఏలు, ఆర్పీలకు రూ.10 వేలు, మున్సిపల్, జీపీ, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.24 వేల వేతనం హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆటో కార్మికులకు ఇస్తామన్న రూ.10 వేల భృతి ఊసే లేదన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు, అసంఘటిత కార్మికుల రక్షణపై ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బడ్జెట్‌లో సవరణలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- లక్ష్యంతో చదివితేనే ఉన్నత శిఖరాలకు మార్గం - చిన్నకొండూరు పాఠశాలలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ





**చౌటుప్పల్, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. శుక్రవారం చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లిన కలెక్టర్.. విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. పరీక్షల సమయంలో భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా రాయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటిస్తూ వారి జీవిత లక్ష్యాల గురించి అడిగారు. ఒక విద్యార్థి తాను భవిష్యత్తులో 'పోలీస్' అవుతానని చెప్పగా, కలెక్టర్ అభినందిస్తూ లక్ష్య సాధనకు ఇప్పటి నుంచే గట్టి పునాది వేసుకోవాలన్నారు. వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఉపాధ్యాయుల సలహాలు పాటించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వంటగదికి వెళ్లి నిల్వ ఉన్న సరుకులు, కూరగాయలను చూశారు. మెనూ ప్రకారం తాజాగా, రుచికరంగా వండి విద్యార్థులకు వడ్డించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి, పరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేస్తూ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఆర్.ఓ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన మంచినీరు అందుతుందా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.





## ఉద్యమకారుల ఉసురు తగిలితే.. గత ప్రభుత్వ గతే!

- త్యాగాలు లేకుండా భోగాలు ఎక్కడివి?
- సర్కార్‌పై జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగీశెట్టి క్రిస్టఫర్ నిప్పులు



**యాదాద్రి భువనగిరి, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ప్రస్తావన లేకపోవడం శోచనీయమని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిష్టఫర్ మండిపడ్డారు. శుక్రవారం భువనగిరిలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రాణాలకు తెగించి, జైలు నిర్బంధాలను ఎదుర్కొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని, అలాంటి ఉద్యమకారులకు బడ్జెట్‌లో కనీస గుర్తింపు లేకపోవడం అన్యాయమన్నారు. ఉద్యమ సమయంలో ద్రోహులుగా వ్యవహరించిన వారు నేడు అధికార భోగాలు అనుభవిస్తుండగా, త్యాగాలు చేసిన ఉద్యమకారులు మాత్రం కోర్టుల చుట్టూ తిరుగుతూ మనోవేదనకు గురవుతున్నారని వాపోయారు. ఉద్యమకారులను విస్మరించిన గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## పంచాయతీ సిబ్బందికి సన్మానం.. పీపీఈ కిట్ల పంపిణీ

- ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత: సర్పంచ్ శాపాక లింగస్వామి
- జలాల్‌పూర్‌లో 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'



**భూదాన్‌పోచంపల్లి, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ సిబ్బంది సేవలను గుర్తించి వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జలాల్‌పూర్ గ్రామ సర్పంచ్ శాపాక లింగస్వామి అన్నారు. శుక్రవారం 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సిబ్బందికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధుల నిర్వహణ, ప్రజలకు అవసరమైన సేవల అందించడంలో పంచాయతీ సిబ్బంది చేస్తున్న కృషిని సర్పంచ్ ప్రత్యేకంగా కొనియాడారు. గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగడంలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ లింగస్వామి మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజల మధ్య ఉంటూ సేవలు అందిస్తున్నారని, వారి ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని అన్నారు. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితుల్లో పరిశుభ్రత, ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత పెరిగిందని, అందుకే వారికి రక్షణ కవచాలుగా పీపీఈ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు ఆరోగ్య నియమాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. గ్రామ ప్రజలు కూడా పరిశుభ్రతపై శ్రద్ధ చూపిస్తూ, పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. సమిష్టి కృషితోనే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే లక్ష్యమని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేసారం మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సిబ్బందికి సన్మానాలు చేసి పీపీఈ కిట్లు పంపిణీ చేశారు.




## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా కిట్ల పంపిణీ

**చౌటుప్పల్, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** ముస్లిం సోదరులు పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ వేళ పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 'రంజాన్ తోఫా' ఎంతో వెసులుబాటు కలిగిస్తుందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మైనార్టీలకు ప్రభుత్వం మంజూరు చేసిన తోఫా కిట్లను ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరుతున్నాయని పేర్కొన్నారు. మైనార్టీల సామాజిక, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పండుగ పూట పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎండి హన్ను బాయ్, షాదీఖానా చైర్మన్ ఎండి కరీం, బాబా షరీఫ్, ముస్లిం మత పెద్దలు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థుల కలలకు 'భాస్కర్ ఫౌండేషన్' భరోసా!

- ఉచిత ఎంసెట్, నీట్ కోచింగ్ సెంటర్ ప్రారంభం
- అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో శిక్షణ: ఇరుగుదిండ్ల భాస్కర్



**చౌటుప్పల్, మార్చి 20 (తొలివెలుగు న్యూస్):** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ఉచిత శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తంగడపల్లి రోడ్డులో గల ఇఎల్‌వి ఫౌండేషన్ కార్యాలయంలో ఉచిత ఎంసెట్, నీట్ కోచింగ్ సెంటర్‌ను ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ సామాజికవేత్త ఇరుగుదిండ్ల భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్ల అనుభవం ఉన్న అధ్యాపకులతో నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థికి కెరీర్ గైడెన్స్ బుక్‌లెట్ అందజేస్తామని, భవిష్యత్తులో ఆర్మీలో చేరాలనుకునే వారికి కూడా ఫౌండేషన్ తరపున సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆలే శ్రీలత, పోలేపల్లి లక్ష్మి, బత్తుల జయమ్మ, బుడ్డ సురేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..


# కుష్బూ వారసురాలిద్దరూ రెడీ..



ఉత్తరాది నుంచి దక్షిణాదికి దిగుమతి అయిన నటి కుష్బూ హిందీలో బాల నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ సంచలన నటి ఆ తరువాత తెలుగులో వెంకటేష్‌కు జంటగా కలియుగ పాండవులు చిత్రంలో కథానాయికిగా పరిచయమయ్యారు. ఆ తరువాత వరుషం--16 చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చారు. విశేషం ఏమిటంటే ఈమె తెలుగు, తమిళం భాషల్లో నటించిన రెండు చిత్రాలు విజయం సాధించాయి. ఆ తరువాత ఈ రెండు భాషల్లోనూ పలు చిత్రాల్లో నటించారు. తమిళంలో రజనీకాంత్, కమలహాసన్, విజయకాంత్, ప్రభు, కార్తీక్ వంటి నటులతో జంటగా నటించారు. కథానాయకిగా బిజీగా ఉండగానే దర్శకుడు సుందర్.సిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తరువాత రాజకీయ రంగప్రవేశం చేసి ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రచార కర్తగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మరో పక్క నిర్మాతగా చిత్రాలు నిర్మిస్తున్నారు. సుందర్.సి, కుష్బూ దంపతులకు అవంతిక, ఆనందిత అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇప్పుడు వారు కూడా సినీ రంగప్రవేశం చేయడం విశేషమేమీ కాదు. చిన్న కూతురు ఆనందిత దర్శకుడు మణిరత్నం వద్ద సహాయ దర్శకురాలిగా చేరారు. పొన్నియిన్ సెల్వన్ 1, 2, థగ్‌లైఫ్ చిత్రాలకు పని చేశారు. పెద్ద కూతురు అవంతిక హీరోయిన్‌గా రంగప్రవేశం చేశారు. ఈమె లండన్‌లో నటనలో శిక్షణ పొందారన్నది గమనార్హం. ఇటీవల ఒక వాణిజ్య ప్రకటనలో నటించి తల్లి కుష్బూ ప్రశంసలు అందుకున్నారు. తాజాగా ఆరంభం అనే మలయాళ చిత్రంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో సరిత మరో ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. సురేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తాజాగా ప్రారంభమైంది. అవంతిక త్వరలో తమిళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ అవుతారని ఆశించవచ్చు.

## కాన్సెప్ట్ బాగుంది కానీ... అందులో వాస్తవం లేదు: దర్శకుడు క్రిష్



దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తదుపరి మూవీ అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనుందని, అందులో ఏడుగురు హీరోయిన్లు నటించనున్నారనే వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ ప్రచారంపై స్పందించిన క్రిష్.. ఏడుగురు హీరోయిన్లు, ట్రెక్కింగ్ అడ్వెంచర్.. ఐడియా బాగుంది, కానీ ఇది నిజం కాదని అన్నారు. సోషల్ మీడియాలో పుట్టిన మరో స్క్రిప్ట్ మాత్రమేనంటూ వదంతులకు తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారు. తన కొత్త సినిమా వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తానని చెప్పారు. గమ్యం మూవీతో దర్శకుడిగా పరిచయమైన క్రిష్, ఆ మూవీతో తెలుగు ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని అందించిన సంగతి తెలిసిందే. తరువాత వేదం, కృష్ణం వందే జగద్గురుమ్ వంటి ఆలోచనాత్మక చిత్రాలు, అలాగే కథానాయకుడు (ఎన్టీఆర్) వంటి బయోపిక్‌ను తెరకెక్కించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన హరి హర వీరమల్లు, ఘాటి మూవీలు గత ఏడాది విడుదలయ్యాయి.



# లొకేషన్‌లో వాగ్వివాదం


షూటింగ్ టైమ్‌లో క్రియేటివ్ డిఫరెన్స్ కామన్. డైరెక్టర్‌కీ డీవోపీకీ మధ్య ఈ విషయంలో గొడవలెక్కువగా వస్తుంటాయి. మూవీ మేకింగ్‌పై నిర్మాతకు అవగాహన ఉంటే కూడా సెట్‌లో వాదనలకు ఆస్కారం ఉంటుంది. ఈ మధ్య సెట్స్‌లో హీరోల జోక్యం కూడా ఎక్కువైందని, కొందరు హీరోలైతే డైరెక్టర్లకీ, డీవోపీలకూ షాట్ ఎలా పెట్టాలో కూడా చెబుతున్నారనీ ఇన్‌సైడ్ టాక్.. ఈ విషయంలో బాలీవుడ్ రెండాకులు ఎక్కువే చదివింది. అక్కడ హీరోయిన్లు కూడా జోక్యం చేసేసుకుంటున్నారట. వివరాల్లోకెళ్తే. యష్‌రాజ్ ఫిల్మ్స్ పతాకంపై లేడీ స్పై థ్రిల్లర్‌గా 'ఆల్ఫా' సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అలియాభట్ లీడ్‌రోల్ చేస్తున్నది. శివ్‌రావెల్ దర్శకుడు. ఈ సినిమా షూటింగ్‌లో అలియాభట్ జోక్యం అధికమవ్వడంతో లొకేషన్‌లో పెద్ద గొడవే జరిగిందట. లొకేషన్‌లో దర్శకుడు శివ్‌రావెల్‌కు క్రియేటివ్ అవుట్‌పుట్స్‌ని అలియా ఎక్కువగా ఇస్తుండటం అసలు గొడవకు కారణమైందని వినికిడి. యాదృశ్చికంగా బాబీడియోల్ కాంబినేషన్ సీన్స్ తీస్తున్నప్పుడు కూడా ఇది జరిగిందట. ఈ విషయంలో కొంతవరకూ బాబీడియోల్ సర్దుకుపోయినా.. వ్యవహారం శృతి మించడంతో అభ్యంతరం తెలియజేయక బాబీడియోల్‌కి తప్పిందికాదు. దాంతో ఇద్దరి మధ్య ఓ స్థాయిలో వాగ్వివాదం జరిగిందట. ఈ గొడవను చల్లార్చి, షూటింగ్‌ను సజావుగా నడిపించేందుకు దర్శక,నిర్మాతలు చాలా కష్టపడాల్సివచ్చిందట. ప్రస్తుతం బాలీవుడ్ మీడియాలో ఈ విషయంపై కథనాలు వెలువడుతున్నాయి. 'అల్ఫా' సినిమా విషయంలో అలియా అధికంగా జోక్యం చేసుకోవడానికి కారణం యష్‌రాజ్ ఫిల్మ్స్ గత చిత్రాలైన వార్ 2, మర్దానీ 3 చిత్రాల ఫలితాలేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.





## సీతతో విడిపోయిన తర్వాత చాలా సంతోషంగా ఉన్నా: పార్తీబన్

సినీ నటి సీత, దర్శకుడు, నటుడు పార్తీబన్ 1990లో ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు 12 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత ఇద్దరూ విడిపోయారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు ఒక కుమారుడిని దత్తత తీసుకున్నారు. విడిపోయినప్పటి నుంచి పార్తీబన్ ఒంటరిగానే ఉంటున్నారు. సీత మాత్రం మరొక వ్యక్తిని పెళ్లాడి, ఆ తర్వాత ఆయనతో కూడా విడిపోయారు. సీతతో తన వివాహం, విడిపోవడంపై పార్తీబన్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... సీతతో విడిపోయినందుకు తాను ఎప్పుడూ బాధపడలేదని చెప్పారు. నిజం చెప్పాలంటే ఆమెతో విడాకులు తీసుకున్న తర్వాత చాలా సంతోషంగా ఉన్నానని తెలిపారు. అయితే, ఆమెతో ఉన్న 12 సంవత్సరాలు తన జీవితంలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయిందని చెప్పారు. ఈ రోజుల్లో పురుషులు కానీ, మహిళలు కానీ వివాహం చేసుకోవడం కంటే స్వతంత్రంగా ఉండానికే ఇష్టపడతారని... ఏ మహిళ కూడా వివాహం పేరుతో పరిమితులు ఉండే జీవితాన్ని కోరుకోదని తెలిపారు. పార్తీబన్ చేసిన ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.



## వారణాసి ఏ జానర్ మూవీ?... రాజమౌళి సమాధానం ఇదే!

దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'వారణాసి'పై ఆసక్తి రోజు రోజుకీ పెరుగుతోంది. హీరోగా మహేశ్ బాబు నటిస్తుండగా, ఈ చిత్రం ఏ జానర్‌కు చెందిందన్న దానిపై వివిధ ఊహాగానాలు వినిపించాయి. టైటిల్ గ్లింప్స్ విడుదలైన తర్వాత కథపై మరింత ఆసక్తి పెరిగింది. ఇక ఆటోమేటిక్ వీల్‌చైర్‌లో విలన్ పాత్రలో కనిపించిన పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్‌లుక్ ఆధారంగా ఇది సైన్స్ ఫిక్షన్ సినిమా అంటూ ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారానికి స్వయంగా రాజమౌళి క్లారిటీ ఇచ్చారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. 'వారణాసి'కి సైన్స్ ఫిక్షన్ ఫీల్ ఉన్నా, ఇది ఆ జానర్ సినిమా కాదని స్పష్టం చేశారు. ఇది ఫాంటసీ --మైథలాజికల్ మూవీ అని వెల్లడించారు. ఆర్ఆర్ఆర్ విజయంతో ఎలాంటి ఒత్తిడి లేదని రాజమౌళి తెలిపారు. కొత్త సినిమా ప్రారంభించినప్పుడు గత చిత్రాల ఫలితాలను దృష్టిలో పెట్టుకోనన్నారు. రుద్ర పాత్రలో వృషభంపై మహేశ్ ఎంట్రీ 'వారణాసి'లో గ్రేటెస్ట్ సినిమాటిక్ మూమెంట్ అవుతుందన్నారు. దర్శకుడిగా ప్రేక్షకులకు ఎప్పుడూ కొత్త అనుభూతి ఇవ్వాలనుకుంటానని తెలిపారు. అది కేవలం విజువల్స్ పరంగానే కాదు, భావోద్వేగాల పరంగానూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మూవీ రన్‌టైమ్ మూడు గంటల కంటే తక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నానన్నారు. పూర్తి సినిమాను ఐమ్యాక్స్ వెర్షన్‌లో తెరకెక్కించాలని భావించినప్పటికీ, కొన్ని పరిమితుల కారణంగా కొన్ని సన్నివేశాలనే ఆ ఫార్మాట్‌లో రూపొందిస్తున్నామని తెలిపారు. రామాయణం ఎపిసోడ్ షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, దానికి సంబంధించిన వీఎఫ్ఎక్స్ పనులు సవాలుగా ఉన్నాయని చెప్పారు. ఈ భారీ ప్రాజెక్ట్ 'వారణాసి' 2027 ఏప్రిల్ 7 న ప్రేక్షకుల ముందుకు రానుంది.

